నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

- 19ఏళ్లలోపు వారు తప్పనిసరిగా వాడాలి
- అవగాహన కల్పించిన వైద్యులు, సిబ్బంది
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


బంగ్లామెట్ట పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఏఎన్ఎం హేమలత


చిట్టివలస రామకృష్ణ విద్యాలయంలో బాలలకు మాత్రలు వేస్తున్న వైద్యురాలు సుష్మిత

తగరపువలస: పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల లోపం, అనారోగ్యం బారిన పడకుండా ఉండడానికి నులి పురుగులను నిర్మూలించాలని వైద్యులు, సిబ్బంది విద్యార్థులకు సూచించారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా నులి పురుగుల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఈ మాత్రలు తినిపించి నీళ్లు తాగించారు. తగరపువలస పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో వైద్యురాలు కె.సుష్మిత, సీవో వై.హరి తదితర ఆరోగ్య సిబ్బంది 20 పాఠశాలలు, 11 అంగన్వాడీ కేంద్రాలు, 6 కళాశాలలో విద్యార్థులకు మాత్రలు అందించారు.

- ఒకటో వార్డు బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఏఎన్ఎం హేమలత మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను కూడా ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు గోళ్లు కత్తిరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.
- భీమిలి మండలం శింగనబంద పంచాయితీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ జీవీ నారాయణ, ప్రధానోపాధ్యాయుడు జి.సత్యనారాయణ నులి పురుగుల నివారణ మాత్రలు అందించారు.
- భీమిలి మండలం మూలకుద్దు యూపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వి.జానకి, ఎంఈవో ఎం.శివరాణి, ప్రధానోపాధ్యాయుడు దుంపల దాలయ్యబాబు, ఏఎన్ఎంలు కవిత, పావని తదితరులు పాల్గొని, మాత్రలు పంపిణీ చేశారు.

ఆర్.వి.పురం హైస్కూల్లో..

పద్మనాభం: ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల కడుపులో ఉండే నులి పురుగులు మృతి చెంది, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అన్నారు. ఎదుగుదల సక్రమంగా ఉంటుందన్నారు. మండలంలోని ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆయన ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు విజినిగిరి శంకరరావు, కె.ప్రభాకరరావు, ఏఎన్ఎం నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.


కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది


ఆర్‌వీపురం హైస్కూల్లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న లక్ష్మణరావు

ఎన్నికలకు సన్నద్ధం కండి

పద్మనాభం: ఎన్నికల సమయం ఆసన్నమైనందున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు యుద్ధానికి సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభం జిల్లా పరిషత్ బంగ్లా ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలన్నారు. ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తిరిగి ముఖ్యమంత్రి అయ్యేందుకు శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముత్తంశెట్టి సూచించారు. తప్పనిసరిగా బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు. నిర్మాణంలో ఉన్న సిమెంటు రోడ్లు, ఆర్బీకేలు, సచివాలయాలను పూర్తి చేయాలన్నారు. అనంతరం అభివృద్ధి పనులపై పంచాయతీల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఉత్తరాంధ్ర యూత్ రీజినల్ కో–ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు సుంకర బంగారరప్పడు, ఈర్ల ఈశ్వరరావు, బుగత సత్యనారాయణ, జి.వి.కె.కె.వర్మ, నెలివాడ స్వామినాయుడు, సుంకర నారాయణరావు, పల్లి మహేష్, తాలాడ పద్మనాభం, రామసింగు ముత్యాలనాయుడు, బేపల గురునాయుడు, చందక శ్రీను, కోరాడ రామేశ్వరావు, మాదిరెడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ఆనందపురం: యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అన్నారు. మండలంలోని తర్లువాడకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మజ్జి అప్పారావు జ్ఞాపకార్థం నిర్వహించిన ఎంఏఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు శుక్రవారం తర్లువాడలో ఎంపీపీ బహుమతులు ప్రదానం చేశారు. ఇటీవల జరిగిన ఈ టోర్నీలో 44 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా ప్రియాంక మాట్లాడుతూ దివంగత నాయకుడు మజ్జి అప్పారావు తన జీవిత కాలంలో క్రీడాకారులను ప్రోత్సహించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడానికి టోర్నమెంట్‌లు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విజేతగా నిలిచిన మిందివానిపాలెం జట్టుకు రూ.25 వేలు, రన్నర్ తర్లువాడ జట్టుకు రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన కోరాడ జట్టుకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతి, ట్రోఫీలను బహుకరించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


టోర్నీ విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక తదితరులు

క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


సేవా పీఠం సందర్శనలో శ్రవణ చైతన్య చినస్వామి

పద్మనాభం: అందరూ ఆధ్యాత్మిక చింతనను అలవరుచుకోవాలని, తద్వారా ప్రశాంతత కలుగుతుందని నెల్లిమర్ల శ్రీదుర్గా మహాపీఠం పీఠాధిపతి శ్రవణ చైతన్య చినస్వామి అన్నారు. మండలంలోని మద్దిలో గల శ్రీధర్మ శాస్తా సేవా పీఠం, నిర్మాణంలో ఉన్న సాగర కనక దుర్గ ఆలయాన్ని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ మనుషులు అసూయ, ద్వేషం, స్వార్థాన్ని విడనాడాలన్నారు. భగవన్నామ సర్మణ చేసుకుంటే ముక్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, బాందేవపురం కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారి అప్పలనాయుడు మృతి



తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ కనకలపేటకు చెందిన ప్రముఖ ఇటుకల వ్యాపారి, లారీ యజమాని కనకల వెంకట అప్పలనాయుడు(52) గుండెపోటుతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈయన అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి. ఈయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

నమ్మివానిపేటలో జెడ్సీ పర్యటన


నమ్మివానిపేటలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ శైలజవల్లి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ కమిషనర్ శైలజవల్లి శుక్రవారం రెండో వార్డు నమ్మివానిపేటలో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెట్టపై డ్రైనేజీలు, రహదారులు నిర్మించాలని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని జెడ్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, వంశీరెడ్డి, నమ్మి మాధవరావు, గడిదీసు సూరిబాబు, కొయ్య రాంబాబు, నమ్మి శ్రీరామ్, నమ్మి అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుష్కలంగా ఆయుర్వేద మందులు


రేవిడి ఆయుర్వేద ఆస్పత్రిలో మందులు

పద్మనాభం: మండలంలోని రేవిడి ఆయుర్వేద ఆస్పత్రిలో వివిధ రకాల ఆయుర్వేద మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి ఎస్.ఎల్.సౌజన్య తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు, కీళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, ఆస్తమా, మహిళా సంబంధిత వ్యాధులకు అన్ని రకాలైన మందులు ఉన్నాయని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కోసం ప్రభుత్వం మరిన్ని మందులు పంపినట్టు ఆమె పేర్కొన్నారు. రోగులు ఈ మందులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘యాత్ర-2’తో వైఎస్ అభిమానులకు పండగ

తగరపువలస: రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన యాత్ర–2 సినిమా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ అభిమానులకు పండగ రోజని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి ఫస్ట్ షో విడుదల తరువాత ఆయన స్థానిక తాతా థియేటర్ ఆవరణలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ మరణాన్ని తట్టుకోలేక రాష్ట్ర వ్యాప్తంగా 700 మంది అభిమానుల గుండెలు పగిలాయన్నారు. 15 ఏళ్లుగా ఆయన లేరన్న విషయాన్ని అభిమానులు మరచిపోలేకపోతున్నారన్నారు. వైఎస్సార్ ప్రజా సంక్షేమ పాలనను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాలను అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ రీజనల్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, శిల్లా కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, జగుపల్లి ప్రసాద్, కొప్పల రమేష్, ఉప్పాడ నాగేశ్వరరావు, జీవీ రమణ, చిల్ల బాబయ్యరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, అల్లిపల్లి నరసింగరావు, చిల్ల సూర్యనారాయణరెడ్డి, అక్కరమాని చినబాబు, చిల్ల గణేష్‌రెడ్డి, గంట్రేటి ఈశ్వరరావు, వెంపాడ వెంకటరమణ, పందిరి విజయ్, సిమ్మల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

వైఎస్సార్‌సీపీకి పెయింటర్స్ అసోసియేషన్ మద్దతు


మాజీ కౌన్సిలర్ జీవీ రమణతో పెయింటర్లు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ తగరపువలస, చిట్టివలస పెయింటర్లు వైఎస్సార్‌సీపీకీ అండగా ఉంటారని మాజీ కౌన్సిలర్ జీవీ రమణ తెలిపారు. శుక్రవారం సంతపేటలో తనను కలిసిన 60 మంది పెయింటర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు వర్గాలకు అండగా నిలిచారన్నారు. స్థానికంగా వీరు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఊడికల లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి ఇప్పాక నరేష్‌బాబు, దండి మోహన్, నేతల కిషోర్, ఊడికల మహేష్, తాటిపూడి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లు స్థలాలు విక్రయించవద్దు

యాజమాన్య ప్రతినిధులను అడ్డుకున్న కార్మిక సంఘాలు


చిట్టివలసలో జేసీబీని అడ్డగించిన ఇంటక్, కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు యాజమాన్యం కార్మికులకు పూర్తిగా బకాయిలు చెల్లించనందున అప్పటి వరకు ఇక్కడి స్థలాలు ఎవరికీ విక్రయించకూడదని ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. సర్వే నంబర్ 10/1లో మిల్లు యాజమాన్య ప్రతినిధులు శుక్రవారం జేసీబీతో చెట్లు తొలగించి క్లీన్ చేస్తుండగా కార్మిక సంఘాల ప్రతినిధులు అడ్డుకున్నారు. కార్మికులకు పూర్తిగా పరిహారం చెల్లించనందున మిల్లు ఆస్తులపై న్యాయస్థానంలో అటాచ్‌మెంట్లు ఉన్నాయన్నారు. అప్పటి వరకు ఆస్తులు విక్రయించినా, చదును చేసినా అడ్డుకుంటామని హెచ్చరించారు. మిల్లు యాజమాన్యం చర్యలపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఇంటక్ అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజు దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరమణ, మునకాల ఆదినారాయణ, చిల్ల రామ్‌పైడియ్య, తమ్మిన కూర్మారావు, చిల్ల వెంకటరావు, నర రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం


స్థానికులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తగరపువలస: బీజేపీ భీమిలి ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భీమిలి మండలం రేఖవానిపాలెంలో స్థానికులతో పార్టీ నాయకులు సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, భీమిలి కన్వీనర్ కంటుబుక్త రామానాయుడు కార్యకర్తలు, నాయకులు కలిసి బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పోస్టాఫీసును సందర్శించి కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణంపై ప్రధాని నరేంద్ర మోదీని అభినందిస్తూ తీర్మానం చేశారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో జరుగుతున్న యూజీ, పీజీ పరీక్షల కేంద్రాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిసెస్ ఏవీఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో జరుగుతున్న పరీక్షలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న బైక్.. ఒకరు మృతి

కూర్మన్నపాలెం: బైక్ అదుపు చేయలేక చెట్టుకు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివీ.. కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన చింతలపాటి మోహన్‌కుమార్(33) పరవాడలోని ఠాగూర్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం జనరల్ షిఫ్ట్ డ్యూటీకి వెళ్లిన మోహన్ అనారోగ్యం కారణంగా మధ్యాహ్నం అనుమతి తీసుకుని ఇంటికి తిరిగి వచ్చేశాడు. రాత్రి స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బైక్‌పై బయలుదేరాడు. తిరిగి అర్ధరాత్రి సమయంలో అగనంపూడి నుంచి రాజీవ్‌నగర్ వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో తాను నడుపుతున్న బైక్‌ను అదుపు చేయలేక చెట్టును ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి.

ఈ ఘటనలో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుల ద్వారా సమాచారం అందుకున్న భార్య స్రవంతి.. భర్త మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఐదు నెలల పాప ఉంది.

నేటి నుంచి దక్షిణ భారత హిందీ ప్రచారసభ పరీక్షలు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించే లోయర్, హయ్యర్ హిందీ పరీక్షలు శని, ఆదివారాల్లో భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో జరుగనున్నాయి. రెండు రోజుల పాటు హయ్యర్ పరీక్షలతో పాటు వైవా జరుగగా ఆదివారం లోయర్ విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు గాను పూర్తిగా ఏర్పాట్లు చేసినట్టు ప్రధానోపాధ్యాయురాలు ఎం.తిరుమల శ్రీదేవి తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు కూడా పంపిణీ చేశారు.

ఉత్సాహంగా మహిళా క్రికెట్ పోటీలు


టాస్ వేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రూపావతి

మధురవాడ: ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీల్లో భాగంగా శుక్రవారం కొమ్మాది శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మహిళా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వీటిని తిరుపతి డీఎస్‌డీవో, రాష్ట్ర క్రికెట్ పోటీల ఇన్‌చార్జ్ షేక్ సయ్యద్ సాహెబ్, విశాఖ సాంఘిక సంక్షేమ గురుకులాల డీసీవో, స్టేడియం వెన్యూ ఇన్‌చార్జ్ ఎస్.రూపావతి తదితరులు టాస్ వేసి ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి మహిళా క్రికెటర్లు పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. తొలి రోజు చిత్తూరు– కాకినాడ, నెల్లూరు–తిరుపతి జట్ల మధ్య జరిగిన పోటీల్లో కాకినాడ, తిరుపతి జట్లు విజేతలుగా నిలిచాయి.

అన్ని రకాల ఏర్పాట్లు

వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు భోజనం, తాగునీరు, టెంట్‌లు, మొబైల్ టాయిలెట్స్ వంటి సదుపాయాలు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

ఏఆర్ పోలీసులు సిద్ధం కావాలి

ఆరిలోవ : ఈ ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికల విధులకు ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు సిద్ధంగా ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి ఏఆర్ పోలీస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఇక్కడ జరుగుతున్న పరేడ్‌ను పరిశీలించి, సిబ్బంది నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి విధుల్లో సిబ్బంది ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. డబ్బు, మద్యం, ఉచిత కానుకలు తరలింపును అరికట్టాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన డీఎస్పీ పి.నాగేశ్వరరావుకు ప్రశంసా పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, రామకృష్ణారావు, వెంకటరావు, అరవింద్ కిశోర్, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించండి

- జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ విశ్వనాథన్

డాబాగార్డెన్స్ : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలు విశాఖ వేదికగా నిర్వహిస్తుందని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో క్రీడలకు సంబంధించి ఏర్పాటు చేసిన పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 13 వరకు పోటీల్లో పాల్గొనేందుకు విచ్చేస్తున్న క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఎందరో క్రీడాకారులు నగరానికి వస్తున్నందున వారికి స్వాగతం పలికే బోర్డులతో పాటు సదుపాయాలకు సంబంధించిన సూచిక బోర్డులు, హోర్డింగులు, బిల్‌బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అలాగే క్రీడాకారులకు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సదుపాయం తదితర వాటిని ఏర్పాటు చేయాలని, మహిళా క్రీడాకారులకు ఆంధ్రా యూనివర్సిటీ మహిళా హాస్టల్లో ఏర్పాటు చేసిన వసతుల్లో ఎటువంటి లోపం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడును ఆదేశించారు. పర్యటనలో పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్, తాగునీటి విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి మహిళలకు ఉచిత యోగా శిక్షణ

ఆరిలోవ: మహిళలకు ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రముఖ యోగా శిక్షకురాలు సులోచన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 24 వరకు డెయిరీ ఫారం సమీప లిటిల్ కిడ్డీస్ ప్లే స్కూల్‌లో ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 12వ తేదీలోగా 94935 28285 నంబర్‌లో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

పద్మనాభం: ఆంధ్రప్రదేశ్ భూమి యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని విశాఖపట్నం బార్ అసోసియేషన్ జేఏసీ కన్వీనర్ బేవర సత్యనారాయణ డిమాండ్ చేశారు. పద్మనాభం జంక్షన్‌లో భీమునిపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ చట్టం వల్ల రైతులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. విశాఖ బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, భీమునిపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. రూ.500 పూజా రుసుం చెల్లించిన దంపతులను లేదా ఇద్దరిని అనుమతిస్తామని చెప్పారు. పైపూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.